
రాజారావు రాత్రి పదిన్నరకు ఇంటికి చేరుకున్నాడు. వస్తూనే, "భ్రమరం నా కంటే ముందే వచ్చావే? నీకో శుభవార్త" అన్నాడు.

భ్రమరాంబ ముందు అతనివైపు కొరకొరా చూసింది. కాని సంబాళించుకుని లేని చిరునవ్వు తెచ్చుకుని, "ఏమిటి?" అని అడిగింది.

"కొత్తగా విప్లవ భర్తల సంఘం నెలకొల్పారు. దానికి నేను కార్యదర్శిగా ఎన్నికయ్యాను."




# విప్లవ భర్తల సంఘం

## పులిగడ్డ విశ్వనాథరావు

భ్రమరాంబ లేని సంతోషం ప్రకటిస్తూ. "కంగ్రాట్స్. ఈ సంఘం ఉద్దేశమేమిటో?" అని అడిగింది.

"ఈ సంఘం భర్తలకు భార్యలపై గల హక్కులను కాపాడుతుంది. మా ఆఫీసులో సాంబమూర్తి. వీధి చివర రామేశం గారు కూడా దీంట్లో చేరారు."

"అందుకేనా ఆలస్యం అయింది. పోనీ రేపటినుంచి పైముకే వచ్చేస్తారు కదూ?"

"నా మొహం! ఇంకా ఆలస్యం అవవచ్చు."

"ఇంతకీ మీరు అంత రాత్రిదాకా చేసే పనులేమిటి?"

"మీ మండలిలాగే మా కార్యకలాపాలు మాకుంటాయి. మేము ఇంటింటా వెళ్ళి భర్తలకు వాళ్ళ హక్కుల గురించి నచ్చచెప్పాలి. కరపత్రాలు పంచిపెట్టాలి. వాళ్ళలో జాగరూకత కలిగించాలి. ఇంట్లో కూర్చుంటే అవుతాయా ఈ పనులు?"

"నాకు ఎలాగూ ఆలస్యం అవుతోంది. మీరూ ఆలస్యంగా వస్తే ఎలా?"

"మరి తప్పదు. నువ్వు ఎలాగో మండలి పనులు పెందరాళే ముగించుకుని ఇంటికి చేరాలి."

"నాకు మండలి మీటింగులతోనే సరిపోతోంది. పైపెచ్చు ఎల్లుండి శంకరాభరణం పాటలపోటీ. దానికి నేనేకదా ఇన్చార్జీని. ఇంకా స్వెట్టర్ల అల్లికపోటీ కూడా పెట్టబోతున్నాము."

"మరి నువ్వే ఆలోచించు. అన్నట్టు విభస (విప్లవ భర్తల సంఘం) నంబర్‌వన్ షరతు ప్రకారం విభస సభ్యులు వంటింట్లో కాలు పెట్టడానికి వీలు లేదు. అందువలన నేను ఇంటికి వేళకు చేరుకున్నా లాభంలేదు."

"మహా- ఎవరు చూడొచ్చారని?"

"కొంప ముంచావు. నియమంగా దాడులు జరుగుతాయి. పట్టుబడితే ఫలానా సభ్యుడు

ఐ.సి.యస్. లో చేరాడని ప్రచారం చేసి. జరిమానా విధిస్తారు."

"ఐతే వంటవాణ్ణి పెట్టించండి."

"అది మన ఆదాయంలో వీలుకాదని నీకు తెలుసుకదా!"

"మీరు ఏమి చేస్తారో చేయండి. నేను మాత్రం ఇప్పట్లో నా కార్యకలాపాలను మానలేను. మండలిలో నా ప్రతిష్ఠ మంట కలవదూ?"

"నీ యిష్టం. నేను ఈ పూట రామేశం గారింట్లో భోంచేశానులే."

భ్రమరాంబ స్థానిక మహిళా మండలి పోటీల సమితికి కార్యదర్శి. మండలి సభ్యురాళ్ళందరిలోనూ ఆమె అతి చురుకైన దని ప్రతీతి. ఆమె వడియాల పోటీ అని. ముగ్గుల పోటీ అనీ. ఊరగాయల పోటీ అనీ ఏదో ఒక పోటీ నిర్వహిస్తూనే ఉంటుంది.

పగలు భర్త రాజారావు ఆఫీసుకు. పిల్లలు బడికి పోగానే ఆమె భుజానికి వానిటీ బాగుతో. రంగురంగుల గొడుగుతో సీతాకోక చిలకలా ముస్తాబయి ఇంటికి తాళాలు వేసి. తాళం చెవులు పొరుగింటిలో పడేసి చాంద్రాయణం మొదలెట్టేది. పిల్లలు బడినుండి వచ్చి పొరుగింట తాళం చెవులు తీసుకుని ఉదయం తల్లి వండిన వంటను వడ్డించుకుని వాళ్ళ బాధ వాళ్ళు పడేవారు.

రాజారావు ఆఫీసునుంచి రాకమునుపే తాను తిరిగి వచ్చేసి. కాఫీ టిఫిన్ అందించు దామని భ్రమరాంబ ఎంతో ప్రయత్నించేది కాని. మండలి పనులు పూర్తి అవుతే కదా! మీటింగ్సు.తోటి సభ్యురాళ్ళను కలుసు కోవడం. గుసగుసలు. మండలిరాజకీయాలు చర్చించడం. ఎవరింటిలో ఏ కష్ట మొచ్చిందో. ఏ సుఖమొచ్చిందో తెలుసు కుని నలుగురికీ రహస్యంగా తెలియ జేయడం. వి.ఐ.పి. బంగళాలవద్ద కాచు కూర్చోవడం-వీటితోనే తరచు ఆలస్యం అయిపోయేది. వారానికి నాలుగైదు రోజులు రాజారావే రాత్రిపూట వంట చేయవలసి వచ్చేది.

రాజారావు వంట వండుతూ భార్యపై విసుక్కుంటూ ఉండేవాడు. భ్రమరాంబ ఆలస్యంగా ఇంటికిచేరుకుని మొగుడి కోపాగ్నిని తన తేనెలొలికేపలుకులతో.త్రిమూర్తులను పరవశింపజేసే చిరునవ్వుతో చల్లార్చేది.

"సారీ మిస్టర్ రాజారావ్. ఆలస్యం అయింది. మీరు వండిన బంగాళాదుంపలు. కాలీఫ్లవర్ కూర నిన్న ఎంత బాగుందో!" అనేది భ్రమరాంబ.

రాజారావు ఏమీ అనకుండా చురచురా చూసేవాడు. "కోపం వచ్చింది కదూ!నేనూ ఇంటికి వేళకే వచ్చేయ్యాలని ప్రయత్నిస్తున్నాను. కాని మండలి పనులు ఉండనే ఉంటాయి. మళ్ళీ వారం "శంకరాభరణం" పాటల పోటీ ఉంది కదా. అన్నట్టు నిన్న సులోచన ఆలస్యంగా ఇంటికి చేరితే ఆమె భర్త నిలదీశాడట. ఆమె ఏమి జవాబు చెప్పిందో తెలుసా? ఆమె జవాబు మీకో పెద్ద కాంప్లిమెంట్ అని చెప్పాలి. ఇన్ ఫాక్ట్ ఐ మస్ట్ కంగ్రాట్యులేట్ యూ!' భ్రమరాంబ భర్తను చూసి బుద్ధి తెచ్చుకోండి. ఆమె రోజూ పదికి ఇంటికి చేరుకున్నా అతడు వండి ఆమెకు వడ్డిస్తాడు. అలా ఉండాలి భార్యాభర్తల అన్యోన్యత అంటే. అని ఆమె అనేసరికి అతనినోట మాట రాలేదుట."

రాజారావు మౌనం వహించేవాడు. ఆమె తీపిమాటలకు లొంగిపోయినా అతడు చేసేది కూడా ఏమీలేదు. భ్రమరాంబతో వాదనపెట్టుకొంటే మరి లాభం లేదని అతనికి తెలుసు. ఆమె ఎంత సౌమ్యంగా వుంటుందో అవసరమొస్తే అంత ముళ్ళకంపలా కూడ ప్రవర్తించ గలదు. ఆమె పెద్ద ఇంటి పిల్ల. మాటమాట వస్తే చాలు. "మా అమ్మ ఎంత వద్దంటున్నా మా నాన్న ఈ కొంపలో పడేశాడు. ఒక నౌకరా. ఒక వంటవాడా. ఇంటి బయట అడుగుపెట్ట కూడదట. ఇంటిపట్టునే ఉండే ఇల్లాలినే చేస్తుకోలేకపోయారా....." అని అందు కుంటుంది. దాంతో రాజారావు కెలాగూ నోటికి తాళం పడుతుంది.


ఇలా వుండగా రాజారావు తోటి ఉద్యోగి సాంబమూర్తి ఒకరోజు ఈ విధంగా మొర పెట్టుకున్నాడు. "నీ భార్య స్థానిక మహిళా మండలిలో కార్యకర్త. నువ్వు అదృష్ట వంతుడివే. నీ భార్య కనీసం ఊరిలోనే ఉంటుందిగా. నా భార్య గ్రామీణ మహిళా అభివృద్ధి సంఘంలో కార్యకర్త. మహిళా నాయకురాళ్ళతో కలిసి గ్రామాలంట తిరుగుతూ వుంటుంది. ఆమె ఊళ్ళో ఉన్నా కూడా ఎప్పుడో కాని వంటింట్లో అడుగు పెట్టదు. నువ్వు నా సన్నిహితుడివి కాబట్టి చెబుతున్నా. విను. నాకీ ఉద్యోగంవచ్చింది ఆమె పలుకుబడితోనే! అందుకు నేను ఆమెను నిర్బంధించలేను."

రాజారావు సాంబమూర్తిపట్ల సానుభూతి ప్రకటించాడు. కాని తనకంటే ఎక్కువ భార్యా బాధితుడు ఒకడు ఉన్నాడని తెలుసుకుని లోలోనే సంతోషించాడు. సాంబమూర్తి ఒక్కడే భార్యా బాధితుడు కాదని తన వీధి చివరనుండే అరవై ఏళ్ళ రామేశంగారు కూడ ఆ కోవకు చెందినవారేనని కొన్నాళ్ళకు రాజారావుకి తెలిసింది.

ఒకరోజు రామేశంగారితో పార్కులో పిచ్చాపాటి మాట్లాడుతూ రాజారావు "ఇహ ఇంటికి పోవాలండీ. మా ఆవిడ ఆలస్యంగా వస్తుందిగా. పిల్లలు ఆకలితో అలమటిస్తూ ఉంటారు. వారికి వంట ఏర్పాటు చేయాలి" అన్నాడు.

దాంతో ఆయనా తన బాధ వెళ్ళగక్కాడు: "నా భార్య జాతీయ స్త్రీ అభ్యుదయ సమాఖ్యకి కార్యదర్శి. ఆమె బొంబే. మద్రాసు. హైద్రాబాదు. ఢిల్లీ వెళుతూ ఉంటుంది! నెలలో రెండు మూడు రోజులు తప్ప ఇంటి పట్టున ఉండదు. ఇంట్లో మా కోడలు. మా అమ్మాయి ఉన్నారు కాబట్టి వంట ఇబ్బంది లేదు కాని. కష్టం. సుఖం చెప్పుకోవడానికి ఇంట్లో ఇల్లాలు ఉండదు. ఇల్లాలు లేని ఇల్లు బోసిగానే ఉంటుంది కదా."

రామేశంగారు కొంత ఆగి మరల అందుకున్నాడు. "నేనెప్పుడైనా ఏమిటీ తిరుగుళ్ళు అని అడిగితే— కోడలుపిల్ల.



అమ్మాయి వున్నారు కదా ఇంటిపనులు చూడడానికి. మనం కూడ ఏమీ పడుచు వాళ్ళం కాదుకదా ఒకర్ని వదిలి ఒకరు వుండలేమనేందుకు! ఏదో సంఘసేవ చేస్తున్నాను. రేపో మాపో ఎం.ఎల్.ఏ. ఎం.పి. అయేఅవకాశం చిక్కవచ్చు—అని బదులు చెబుతుంది."

మరొక భార్యా—బాధితుడు దొరికినందుకు రాజారావు లోలోనే సంతోషించాడు.

కొన్ని రోజులకు బస్సులో చిన్ననాటి స్నేహితుడు నరసింహం కలిసాడు. అతడు ఒక కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. దారిలో నరసింహం బస్సు దిగుతూ రాజారావుని కూడ బలవంతాన తన ఇంటికి తీసుకొచ్చాడు. ఇంట్లో నరసింహం భార్య కనబడలేదు. ఒక నౌకరు వంటావిడ అంత పనీ చేస్తున్నారు.

"నీ భార్య పుట్టింటికి వెళ్ళిందా?" అని రాజారావు అడిగాడు.

"పుట్టిల్లు లేదు. గాడిద గుడ్డు లేదు. మా మేనేజింగ్ డైరెక్టరు భార్య మా ఫాక్టరీ ఉద్యోగుల సంక్షేమ సంఘానికి అధ్యక్షురాలు. ఆమె నా భార్యను సంఘం కార్యదర్శిగా ఎన్నిక చేయించి తన కుడిచేయిగా వాడుకుంటోంది. మనకెందుకు వచ్చిన ఈ గొడవని ఎంత బ్రతిమాలినా తల దూర్చింది. అంత గొప్పవ్యక్తికి నమ్మకస్తురాలుగా పనిచేస్తే ఎంత గౌరవం. తోటి మహిళలలో ఎంత పలుకుబడి అనిచెప్పేది. దాంతో ఆమె ఇప్పుడు రాత్రి పది, పదకొండు వరకు మేనేజింగ్ డైరెక్టరు గారి భార్యతో వాళ్ళ ఇంట్లోనో లేక ఫ్యాక్టరీలోనో లేక కార్మికుల క్వార్టర్స్‌లోనో తిరుగుతూ కాలక్షేపం చేస్తుంది. మానేజింగ్ డైరెక్టరు గారి భార్య మాఇంటి పనిచేయడానికి కంపెనీ తరపున ఒక వంటావిన్నీ, ఒక నౌకర్ని నియమించింది. కాని ఇల్లాలి లోటు భర్తీ అవుతుందా? ఇలా ఉంది నా ఖర్మ" అని మొరబెట్టుకున్నాడు నరసింహం.

బలేగా వుంది! తనకు తెలిసిన భార్యా బాధితుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతూందే అని రాజారావు లోలోనే సంతోషించి నరసింహానికి "గుడ్‌బై" చెప్పి వచ్చేశాడు.

మరో రోజు వెంకటేశం తారసిల్లాడు. ఒక స్నేహితుడి ద్వారా ఇదివరకు రాజారావుకు అతడితో పరిచయం ఏర్పడింది. వెంకటేశం తన భార్య రచయిత్రి అని చెప్పాడు.

"కంగ్రాట్యులేషన్స్. భార్య ప్రసిద్ధి చెందిన రచయిత్రి అవడం అదృష్టమే కదా!" అని రాజారావు అన్నాడు.

"అదృష్టమా పాడా! ఇంట్లో ఉన్నంతసేపూ మా ఆవిడ కథలూ, సీరియల్సూ రాస్తూ కూర్చుంటుంది. దానికితోడు ఆమె యీ ఊరి రచయిత్రుల సంఘానికి కార్యదర్శి. పై ఊళ్ళనుంచి రచయిత్రులను ఆహ్వానించడం, సన్మానించడం, ఊళ్ళో రచయిత్రుల సమావేశం జరిపించడం, రచనలు చదవడం, వీటితోనే ఆమె ఎల్లప్పుడూ బిజీగా ఉంటుంది."

"మరి ఇంటిపనులు?"

"మా అమ్మ చూసుకుంటుంది. కాని పండు ముసల్ది కదా చేయడం కష్టంగానే ఉంటుంది. మీరు మనవాళ్ళే కాబట్టి చెబుతున్నా. మా ఇంట్లో మా ఆవిడకీ, మా అమ్మకీ రోజూ ఘర్షణే. ఇంట్లో శాంతి ఉండదు" అని వెంకటేశం సొద చెప్పుకున్నాడు.

"ఔను- నిజమే" అని సానుభూతి ప్రకటించాడు రాజారావు.

పరిచయస్థుడు వెంకటేశం, చిన్ననాటి స్నేహితుడు నరసింహం, తోటి ఉద్యోగి సాంబమూర్తి, వీధి చివరి రామేశంగారు, అందరూ ఒక ఊబిలో చిక్కుకున్న వారే. ఈ ఊబి నుంచి బైటపడే మార్గం ఆలోచిస్తే వీరంతా ముక్తి పొందవచ్చు. అన్నిటికంటె ముఖ్యం వీళ్ళందరినీ ఒక చోట చేర్చడం. మర్నాడు సాంబమూర్తితో నరసింహం, వెంకటేశం, రామేశంగారి గురించి చెప్పి, "మనమంతా ఒక చోట చేరి చర్చిస్తే ఈ సమస్యకు పరిష్కారమార్గం కనుగొనవచ్చుగా!" అని ప్రస్తావించాడు.

"సరే బాగుంది." అన్నాడు సాంబమూర్తి. మర్నాడు రాత్రి తొమ్మిదికి పార్కులో కలుసుకుందామని నిర్ణయించాడు రాజారావు. నరసింహాన్నీ, వెంకటేశాన్నీ వాళ్ళవాళ్ళ ఆఫీసుల్లో కలుసుకుని తన ప్రతిపాదన్ని విశదీకరించాడు. ఇద్దరూ రాజారావు ప్రతిపాదన్ని సమర్థించి తప్పకుండా మర్నాటి రాత్రి సమావేశంలో పాల్గొంటామని మాట ఇచ్చారు.

"నువ్వు ముక్తిమార్గం కల్పిస్తే నేను వద్దంటానా." అన్నాడు నరసింహం.

"ఏమో మా ఆవిడ అంత సులువుగా దారిలోకి వస్తుందని నేను నమ్మను. కాని మన ప్రయత్నం మనం చేయాలిగా." అన్నాడు వెంకటేశం.

ఆ సాయంత్రం రామేశంగార్ని కలుసుకుని విషయమంతా బోధపరిచాడు. "తప్పకుండా కలుసుకుందాం. ఏదో ఉపాయం తోచకపోతుందా, మన భార్యలకు తెలివి రాకపోతుందా" అని ఆశాభావం వ్యక్తం చేశాడు ఆయనాను.


జాన్సన్ మిక్సర్

* అత్యంత శక్తి వంతమైన మోటారు
* తక్షణ సర్వీసు సదుపాయం.
* 3 వార్లతో పేల్పకి సర్వీసు
సోనో విజన్,
ఏలూరు రోడ్, విజయవాడ-2.
SUVARNA

డా॥ ఎ.ఎ.కె. రావ్ B.A.
వైద్య విద్వాన్-వైద్యాచార్య

వివాహం కాయిదా చేయ్యు ఉత్సాహం లేదు. దాంపత్య సౌఖ్యం పొందుటకు, నరముల బలహీనతకు ఆయుర్వేద చికిత్స కలదు.
రావూస్ క్లినిక్
బి. బి. రోడ్, తెనాలి
ఫోన్స్ : 3700 & 4010
* పోస్టుద్వారా చికిత్స కలదు.
SUVARNA

నెలకు 1,000 -లు సంపాదించండి
ఫొటోగ్రఫీ టీచరు రు. 15/-: ఎలక్ట్రిక్ గైడ్ రు. 15/ : వివాహ జీవితం 100 బొమ్మలతో రు. 15/-: మెడికల్ సెక్స్ గైడ్ 188 బొమ్మలతో రు. 20/-: టైలరింగ్ & కటింగ్ రు. 16/-: డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ గైడ్ రు. 15/-: ట్రాన్సిస్టరు రేడియో గైడ్ రు. 15/-: 300 కాపీజిఇం కన్‌స్ట్రక్షన్ గైడ్ రేడియోగైడ్ రు. 30/- ప్రతిదానికి పోస్టేజి రు. 2/- అదనం.
ILFA BOOk DEPOT (AJ—25)
ALIGARH



అనుకున్నట్టే మర్నాటి రాత్రి ఐదు గురూ పార్కులో సమావేశమైనారు.

"మనందరినీ పీడిస్తోంది ఒక సమస్య. అది మన భార్యలు సంఘసేవ పేరిట ఇంటిపట్టున ఉండకపోవడం. ఈసమస్యను క్షుణ్ణంగా చర్చించి. ఏదైనా ముక్తిమార్గం కనుగొనవచ్చునని ఈ సమావేశాన్ని ఏర్పాటుచేశాను. మనం ఐదుగురం ఒక సంఘంగా సంఘటితమై ఇంకా సభ్యులను చేర్చుకుంటే కృతకృత్యుల మవగలమని నా ఆశ! ఈ సంఘానికి విప్లవ భర్తల సంఘం లేక క్లుప్తంగా 'విభస' అని నామకరణం చేయాలని నా సూచన." అని రాజారావు సభాసదులకు ప్రకటించాడు.

రామేశంగారు. సాంబమూర్తి. నరసింహం. వెంకటేశం పేరు భేషుగ్గా ఉందని ఆమోదించారు.

"ఈ సంఘానికి రామేశంగారు అధ్యక్షులు కావాలని ప్రతిపాదిసున్నాను" అని సాంబమూర్తి అనగా రామేశంగారు ఏదో చెప్పబోయారు కాని మిగతావాళ్ళంతా "వీ సపోర్ట్" అని బిగ్గరగా అరిచారు. రామేశంగారు వొప్పుకోక తప్పలేదు.

"రాజారావుని కార్యదర్శిగా ఎన్నుకొంటున్నాము" అని సాంబమూర్తి మరల అన్నాడు. మిగతావాళ్ళు "వీ ఆల్ సెకెండ్" అని అరిచారు. రాజారావు మౌనంగా ఉండి తన అంగీకారం తెలిపాడు.

"ఈసంఘానికి రామేశంగారు అధ్యక్షులు గాను. నేను అనగా రాజారావు కార్యదర్శి గాను ఎన్నికయినట్టు ప్రకటిస్తున్నాను. మన విభస ఉద్దేశాన్ని కూడ నిర్వచించాలి కదా. విభస ముఖ్య ఉద్దేశం భార్యలపై భర్తలకు గల హక్కులను కాపాడడం. భర్తల సంక్షేమాన్ని పెంపొందించడం. పోతేఇవాళ ఎజెండాలో ఒక అంశమే వుంది. అది మన అర్ధాంగులను విహారాంగనలు కాకుండా ఇంటిపట్టునే వుండేలా చేయడం. ముందు సంఘం అధ్యక్షులు. ఈ సభాధ్యక్షులు శ్రీ రామేశంగారు తమ అభిప్రాయం చెబుతారు" అని రాజారావు చిన్న ప్రసంగం ఇచ్చాడు.

రామేశంగారు. "వజ్రాన్ని వజ్రం తోటి. ఇనుమును ఇనుముతోటీ కోస్తారు. మన ధర్మపత్నులు మనని అధర్మంగా ఏ విధంగా వేధిస్తున్నారో అలాగే మనమూ వాళ్ళనివేధించాలి.తప్పక ఫలితంఉంటుంది" అన్నారు.

"అంటే మనమూ ఏదో మిషమీద రాత్రి బాగా పొద్దు పోయాక కాని ఇంటికి చేర రాదు. అనా మీ అభిప్రాయం?" అని రాజారావు అడిగాడు.

"ఎక్సాక్ట్లీ" అన్నారు రామేశంగారు.

"అద్భుతంగా ఉంది మీ ఐడియా రామేశంగారూ! ఎంతైనా మా అందరిలో మీది పెద్ద బుర్ర కదా! చర్చ లేకుండానే పరిష్కారమార్గం సూచించేశారు. ఐతే నాదో చిన్న ప్రతిపాదన.భార్యలకు విభస. సభ్యులమయామని చెప్పి. దీని మొదటి షరతు ప్రకారం మేము వంటింట్లో అడుగు పెట్టకూడదని స్పష్టంగా ప్రకటించాలి." అన్నాడు రాజారావు. అంతా ఈ ప్రతిపాదనను ఆమోదించారు.

"ఇంటికి ఆలస్యంగా చేరే ఉపాయం ఫలించకపోతే?" అని సందేహం వెలిబుచ్చాడు వెంకటేశం.

కొంత చర్చ జరిగాక సాంబమూర్తి ఒక ప్రతిపాదన పెట్టాడు. "అదీ ఫలించకపోతే ఆ భార్యామణికి విభస తరఫున ఒక నోటీసు పంపుతాం. దాంట్లో మా ఫలానా సభ్యుడికి మీ యందు మీ భర్తగాగల ఆయన హక్కులను మీరు ఉల్లంఘిస్తున్నారు కాబట్టి మీరు సమయానికి ఇంటిలో వుండి భార్యగా మీ విధులను సక్రమంగా నిర్వర్తించకపోతే కఠిన చర్యలు తీసుకోవలసివస్తుందని వుంటుంది."


"ఏమిటో ఆ కఠిన చర్యలు?" అని నరసింహం గొణిగాడు.

"మరి అదే ఆలోచించాలి." అన్నాడు సాంబమూర్తి.

"అది. నాకు తోచిందిలే. ధరణా ఇవ్వడం", అన్నాడు నరసింహం.

"నరసింహం ప్రతిపాదన బాగుంది. విభస- సభ్యులంతా ఆ భార్యామణి ఇంటి ముందు ధరణా ఇవ్వాలి" అని రాజారావు అన్నాడు. అంతా ఆమోదించారు. వచ్చే

## వినాయకా!



అందరు నిను పూజిస్తే
ఆ దేవుడవై తినేవు!

కొందరి భజనలకె మేలు
కూర్చెదవెందులకు స్వామి!

పందికొక్కు ఉద్యోగం
పాతెకాపు చేయలేద?
కడుపునిండ తిండి పెడితె
బరువు బండ మోయలేద?

కూలీలకు గంజిపోశ్నె
కుడుములు ఉండ్రాళ్ళా?
శ్రమజీవుల కడగళ్ళె
సమత కానవాళ్ళా!?

—సాయల సత్యనారాయణ



నెల 15వ తారీఖున మరల పార్కులోనే అదేవేళకి కలుసుకుందామని నిశ్చయించుకున్నారు. ఈ లోగా ఇంటికి ఆలస్యంగా చేరే ఉపాయాన్ని అమలు పెట్టడానికి పూనుకున్నారు.

భ్రమరాంబకు మతిపోతోంది. వేళకు ఇంట్లో ఉండకపోతే రాత్రి పూట పిల్లలు వస్తుంటున్నారు. వాళ్ళను చూసేవాడులేడు. పుట్టింటికి వెళ్తానని బెదిరించింది. కాని రాజారావు పిల్లలను కూడా తోడు తీసుకెళ్ళు అన్నాడు. వాళ్ళను తీసుకెళితే మహాఐతే వారం రోజులు పుట్టింట్లో ఉండవచ్చు లేకపోతే వాళ్ళ చదువులు చెడిపోతాయి. ఆ ఆలోచన మానుకుంది.

చంటివాడు ఏడ్చిఏడ్చి ఇరుగుపొరుగు వాళ్ళను కూడ ఖంగారు పెట్టేస్తున్నాడట. వాళ్ళు తనని గుచ్చిగుచ్చి అడుగుతున్నారు ఈ బాధ భరింలేక భ్రమరాంబ శంకరాభరణం పాటల పోటీ తర్వాత నుండీ పిల్లలు ఇంటికి రాకమునుపే చేరుకుంటోంది. అలా అని మండలి పనులు మానలేదు. పోటీల సమితి కార్యదర్శిగా తన విధులను సవ్యంగానే నిర్వర్తిస్తోంది. మానేసిందల్లా అనవసరమైన తిరుగుళ్ళు. గుసగుసలు. వి. ఐ. పి. బంగళాల వద్ద కాచుకుక్కోవడం. ఇతర మహిళల యింటిగుట్లు చర్చించడం లాంటివి. రాజారావుకూడా వేళకే ఇంటికి తిరిగివస్తున్నాడు.

నెల రోజులకు విభస సభ్యులు పార్కులో సమావేశమైనారు. అధ్యక్షులు సభ్యులను రిపోర్టులు ఇవ్వమన్నారు. రాజారావు తాను విజయం సాధించిన వైనం వివరించాడు. సాంబమూర్తి కూడ ఇంచుమించు అలాంటి రిపోర్టు ఇచ్చాడు. అయితే అతడి భార్య కాస్త మొండి. కాబట్టి దారిలోకి రావడానికి ఎక్కువ సమయం పట్టింది. ఘర్షణ కూడా ఎక్కువే జరిగింది.



## మార్పు కోసం

దేవేంద్రుడు అమృతాన్ని తాగి తాగి మొహమ్మొత్తి బెజవాడలో ఓ క్యాబ్రే డ్యాన్స్ ప్రోగ్రాంకు వెళ్ళి, నాల్గు పెగ్గుల విస్కీ కొట్టి, అందులో ఓ మిటారిని మాట్లాడుకొని ఆ రాత్రి గడిపి తెల్లవారే ముందు ఆమెకు ఆ అద్భుతాన్ని చెబుదామని "దేవీ. నేను.... దేవేంద్రుడిన్ని!" అన్నాడు గర్వంగా.

"చంపావు గదటయ్యా! నీతో విసుగు పుట్టి, కాస్త ఛేంజ్ కోసం. ఈ రాత్రికి ఇలా తగలడ్డాను. ఇంకా గుర్తించలేదా.... నేను. రంభని!"

—సి హెచ్ వి యార్. నిడుబ్రోలు

నరసింహం ఇంట్లో వంటావిడ ఉంది కాబట్టి తాను ఆలస్యంగావచ్చినా ఏమీ లేదారావడంలేదని రిపోర్టు ఇచ్చాడు.

"ఐతే నువ్వుమీ వంటావిణ్ణి పీకిపారేయ్. అదెలా అంటావా. ఏదో ఉపాయం ఆలోచించాలి. ఆమెకు కంపెనీ జీతం ఇస్తుందాయె" అన్నాడు సాంబమూర్తి.

"నువ్వు ఆమెను అల్లరిపెడితే?" అని సూచించాడు.

"ఛ ఆమెకు నా తల్లి ఈడు ఉంటుంది" అన్నాడు నరసింహం.

"ఐతే. విభస— శరతు నెంబరు వన్-


పాఠకుల అభిరుచిని దృష్టిలో వుంచుకొని వైవిధ్యంగల నవలలను అందించే మా అభిమాన ప్రచురణ సంస్థ నుండి 1983 జూలై 20న విడుదలయ్యాయి!

* నల్లటిలోయ్యున్నాయి జాగ్రత్త! - మల్లాది వెంకటకృష్ణమూర్తి - రూ.17/-
(విజయ మాసపత్రిక సీరియల్ - నవలా ప్రపంచంలో కొత్త ఒరవడిని సృష్టించిన జియాలాజికల్ ఫాంటసీ థ్రిల్లర్)
* రేపటి కొడుకు ............ మల్లాది వెంకటకృష్ణమూర్తి - రూ.12/-
(నవలా ప్రియదర్శిని లో బహుమతి పొంది 'కువారీ బహు' హిందీ సినిమాగా రూపొందుతున్న మొదటి తెలుగు నవల)
* మంచు బొమ్మలు ........ వేల్పూరి సుభద్రాదేవి - రూ.18/-
(ఈ తరం పాఠకులు ఇంతవరకు చదివి వుండని మనోహర నవల)
* కైలాస నగరం ............ శ్యాంబాబు - రూ.15/-
(అపరాధ పరిశోధన సీరియల్ - మహాభారతకాలం నాటి వ్యక్తులు ఈ రోజుకీ హిమాలయాలలో వున్నారా? భ్రాంతి గొలిపే నవల)
* అమానుషం ............ వసుంధర - రూ.15/-
(అపరాధ పరిశోధన సీరియల్ - మొదటి పేజీ నుండి చివరి పేజీ వరకు మిమ్మల్ని ఉర్రూతలూగించే హర్రర్ నవల)
* కౌగిట్లో కృష్ణమ్మ ........ లల్లాదేవి - రూ.16/-
(ఆంధ్ర జ్యోతి వీక్లీ సీరియల్ - ఆత్మలు, ప్రేతాత్మల గురించి తెలుసుకోండి)
* జీవన యాత్ర ............ మాదిరెడ్డి సులోచన - రూ.18/-
(నిత్య నూతనంగా చెప్పబడిన కుటుంబ నవల)

1983 మార్చిలో విడుదలయ్యాయి!

| | | |
|---|---|---|
| మల్లాది | - ఈ గంట గడిస్తే చాలు | రూ.17/- |
| మాదిరెడ్డి | - కాంతి రేఖలు | రూ.15/- |
| ,, | - పూల మనసులు | రూ.15/- |
| చిల్లకుల | - మూడో పురుషార్థం | రూ.25/- |
| ,, | - ఏది పాపం? | రూ.15/- |
| లల్లాదేవి | - ఆమ్రపాలి (ద్వితీయ ముద్రణ) | రూ.13/- |
| ,, | - అగ్ని కిరీటం ( ,, ) | రూ.15/- |
| రమణశ్రీ | - అతీంద్రియ శక్తులు | రూ.18/- |
| జి. భవానీ కృష్ణమూర్తి | - ప్రణయ కలహం | రూ.17/- |

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్
మ్యూజియం రోడ్, విజయవాడ-2
PHONE: 63322

కావలసిన పుస్తకాల ధరలో 1 రూపాయి తగ్గించి M.O. చేయండి! ఆ రూపాయికి వి.పి. లో పంపుతాం!

Bachi

అనగా సభ్యులు వంటఇంట్లో అడుగుపెట్ట రాదన్న భోగట్టా నీ భార్యకు చెప్పావా?"

"అరే, చెప్పలేదే.... వంటావిడ వుంది కాబట్టి ఈ షరతు చెప్పే అవసరం లేక పోయింది."

"భేషుగ్గావుంది. వంటావిడ వంట బాగు లేదని, నేనే వంట వండుతానని చెప్పు. ఒకటి, రెండు రోజులు వంట వండి విభస-పనులు ఎక్కువయాయని ఆలస్యంగా ఇంటికి చేరుకుంటూ వుండు."

"అది బాగానే వుంది." అని అంతా ఆమోదించగా నరసింహం అంగీకరించాడు.

వాళ్ళ అమ్మ వుంది కాబట్టి ఇంట్లో పనులు నిరాటంకంగా జరిగిపోతున్నాయని, అందువలన తాను ఆలస్యంగా వెళ్ళినా ఏమీ ఫలితం లేకపోతున్నదని వెంకటేశం కూడ రిపోర్టు ఇచ్చాడు.

"ఐతే నువ్వు మీ అమ్మని వీలయినంత త్వరలో కాశీయాత్రకో లేక మీ అన్నయ్య ఇంటికో పంపేయ్" అని రామేశంగారు సలహా ఇచ్చారు. ఆ సలహాను అందరూ ఆమోదించగా వెంకటేశం స్వీకరించాడు.

"నాకు నౌకరీ మాన్పించడానికి వంటావిడ లేదు. కాశీ కాని ఇతర జాగాకి పంపించ డానికి అమ్మలేదు. మా కోడలు, అమ్మాయినిఎలా దూరంచేయగలను? నేను రాత్రల్లా ఇంటికి రాకపోయినా ఎవరూ పట్టించుకో వడం లేదు" అని రామేశంగారు మొరబెట్టు కున్నారు.

"విభస బ్రహ్మాస్త్రం ప్రయోగిస్తేనేకాని మీకు లాభం ఉండదు. నోటీసు పంపుతాం" అని రాజారావు ప్రతిపాదించాడు. అంతా ఆమోదించారు.



మరో నెల్లాళ్ళకు జరిగిన విభస సమావేశంలో నరసింహం, వెంకటేశం విజయం సాధించినట్టు రిపోర్టులు ఇచ్చారు. రామేశం గారు మాత్రం తన భార్యలో నోటీసువల్ల అణుమాత్రమైనా తేడా రాలేదని చెప్పారు.

"అయితే ఎల్లుండి నుంచి ధరణా ఇద్దాం" దీనిని అందరూ ఆమోదించగా ఫలానా తారీఖునుంచి ధరణా ఇస్తున్నామని రామేశంగారి భార్యకు నోటీసు పంపారు. కాని ఆమె మర్నాడే అనుకోకుండా టూరు వేసుకుని వెళ్ళిపోయింది.

ఆమె తిరిగి వచ్చాక ఈసారి చెప్ప కుండా రామేశంగారి ఇంటిముందు ధరణా ఇద్దామని విభస నిర్ణయించింది. అనుకున్న ట్టుగా ధరణా ఇచ్చింది కూడ. రామేశం గారు కూడ పాల్గొన్నారు. మధ్యాహ్నం ఒంటిగంటయింది. ఇంటిఎదురుగా తివాచీ పరుచుకుని ఐదుగురు సభ్యులు కూర్చుని ఉన్నారు. వాళ్ళకి కొంత దూరంలో రామేశంగారి ఆల్సేషియన్ కుక్క టైగర్ నలుగురు అపరిచితుల్ని చూసి మొరిగిమొరిగి చంపేస్తోంది. చూడటానికి కూడా అది భయంకరంగా ఉంది. దాన్ని కట్టి ఉంచక పోతే అది నలుగురు పేర్లను వాళ్ళ వయస్సులతో సహా మర్నాటి దిన పత్రికలలో "కుక్కద్వారా నలుగురి హత్య" అనే శీర్షిక క్రింద పడేలా చేయగలదని వేరే చెప్ప నక్కరలేదు.

ముందు రామేశంగారి అమ్మాయి వచ్చి ఆయన్ని భోజనానికి పిలిచింది. "ముందు మీ అమ్మని ఇంటి పట్టున ఉండటానికి ఒప్పించు-వస్తాను"అన్నారు. కోడలు వచ్చి పిలిచింది. ఆమెకూ అదే జవాబు చెప్పారు. ఈసారి రామేశంగారి భార్యామణే వచ్చింది. ఆరితేరిన వక్తేమో రాగానే ప్రసంగం ప్రారంభించింది.

"మీరు మరీ చిన్న పిల్లాడిలా అయి పోయారు. మీకయితే ముంచుకొస్తున్న వృద్ధాప్యం వల్ల అలా చాదస్తం హద్దు దాటింది కాని, ఈ కుర్రాళ్ళకేం వచ్చింది? ముందు మీరు లోనికి నడవండి". అని రామేశంగారికి ఆదేశం ఇచ్చి నలుగురివైపు తిరిగి ఇలా అంది:

"అసలు మీకు భార్యా భర్తల మధ్య జోక్యం చేసుకునే హక్కు ఎవరిచ్చారు? మేం టూర్లమీద తిరుగుతున్నాం, వీధులలో తిరుగున్నాం అంటే అది ప్రజాశ్రేయస్సు కొరకే. మాకేమీ ఒరిగిపోయిందేమీలేదు. మీ భార్యలలా నేను ఇలాంటి నంగిరి పింగిరి చేష్టలకు లొంగిపోయేదాన్నేమీ కాదు. మీరు మర్యాదగా ఇక్కడనుంచి నిష్క్రమిస్తే మీ ఆరోగ్యానికే మంచిది. ఒసేవ్ కమలా! ఆ టైగర్ని చూడు, ఆకలిగా వున్నట్టుంది. తిండిపడ్డించి దాన్ని విడిచిపెట్టు- కాని వీళ్ళు వెళ్ళాకకాని విడిచి పెట్టకు. వెధనగొడ్డు మామూలుగా వదిలినా మనుషులను కొరికేస్తుంది. దాంతో ఆకలిగా వుంటే చెప్పాలా! థాంక్స్."

ఈపాటికి రాజారావు, సాంబమూర్తి, నరసింహం, వెంకటేశం ఇంటిలోకి నడిచి వెళ్తున్న రామేశంగారివైపు జాలిగా చూసి అక్కడనుండి వడివడిగా నడవసాగారు.

